# బాలనాగమ్మ

బృహస్పతి అప్పటికి ఒక పాత సినిమా సీడీ కోసం ఎనిమిది షాపులు తిరిగాడు. ఆ షాపులో కూడా దొరకలేదు. అయినా అతను నిరుత్సాహపడలేదు. ఏదో ఒక షాపులో తనకు కావలసిన బాలనాగమ్మ సినిమా సీడీ దొరుకుతుందని అతనికి నమ్మకం వుంది.

"పోనీ ఎక్కడ దొరుకుతుందో చెబుతారా?" షాపులో వున్న మనిషిని అడిగాడు బృహస్పతి....

"బాగా పాత సినిమా సీడీలు అమ్మే షాపు ఒకటి వుంది. అక్కడ మీకు తప్పకుండా దొరకవచ్చు" అని ఆ షాపతను ఒక అడ్రస్సు చెప్పాడు.

అతడికి థ్యాంక్స్ చెప్పి బృహస్పతి ఆ షాపులో నుంచి బయటకు వచ్చి కొంచెం దూరంలో వున్న మరో షాపులోకి వెళ్లాడు.

అది పెద్ద షాపు కాదు. గాలి, వెలుతురు అంతగా రాని చిన్న గది. అందులో బల్లముందు భూతద్దాల వంటి కళ్లజోడు పెట్టుకుని ఒకాయన కూర్చుని బయటకు చూస్తున్నాడు.

బృహస్పతి ఆయన్ని బాలనాగమ్మ సినిమా సీడీ కావాలని అడిగాడు. అప్పుడు ఆయన లేచి కొంచెం వెనక్కు వెళ్లి అరల్లో కొంచెంసేపు వెతికి చివరకు ఒక సీడీ తీసుకువచ్చి బృహస్పతికి ఇచ్చాడు. దానిమీద బాలనాగమ్మ అనే పేరు చూసి బృహస్పతి కళ్లు మెరిశాయి.

దాని ధర కొంచెం ఎక్కువయినా చెల్లించి బయటకు వచ్చి సంతోషంతో రోడ్డుమీద నడవసాగాడు. అంతా తను కోరుకున్నట్టుగానే జరుగుతోంది. తన నమ్మకం వృథా కాలేదు. బాలనాగమ్మ సీడీ దొరికింది.

ఆరోజు బృహస్పతి తండ్రి చనిపోయిన రోజు. ఆ రాత్రి బృహస్పతి తన తండ్రి జీవితకాలంలో ఎప్పుడో చిన్నతనంలో చూసిన ఒకే ఒక్క బాలనాగమ్మ సినిమాను మళ్లీ తండ్రికి చూపించాలని సంకల్పించుకున్నాడు. అందుకే పాత సినిమా సీడీ కోసం అంత ప్రయత్నం చేశాడు.

తండ్రి జ్ఞాపకాలతో ఇల్లు చేరాడు బృహస్పతి. ఇంటికి చేరినా తండ్రి జ్ఞాపకాలు అతన్ని వీడిపోలేదు. పదే పదే గుర్తుకురాసాగాయి.

"దొరికిందా?" అడిగింది బృహస్పతి భార్య ఇందుమతి. దొరికిందని సీడీని చూపించాడు.

"అయితే మా మామగారికి ఈ రాత్రి బాలనాగమ్మ చూపిస్తారన్న మాట" అన్నది నవ్వుతూ....

"అవును. మా నాన్నకు ఇష్టమైన సినిమా.... ఎప్పుడూ ఈ సినిమా గురించే చెబుతూవుండేవాడు" అని చెప్పి అప్పటికప్పుడు తను ఆఫీసుగదిగా ఉపయోగించుకునే గదిలోనే టీవీలో ఆ సీడీ ప్రదర్శనకు అవసరమయిన ఏర్పాట్లను చేశాడు బృహస్పతి.

హాల్లో వున్న టీవీని తీసుకువెళ్లి గదిలో గోడపక్కనే వున్న బల్లమీద వుంచి పక్కనే డీవీడీ ప్లేయర్‌ని వుంచాడు. బల్ల ఎదురుగా కుర్చీ వేసి అందులో కొంచెం పెద్దదిగా వున్న తన తండ్రి ఫోటోను వుంచాడు.

ఇంట్లో భార్య తప్ప ఎవరూ లేరు.

ఇప్పుడు ఏడు గంటలు కావస్తోంది. గదిలో ట్యూబ్‌లైటు వెలుగుతోంది. భార్యను పిలిచి....

"సినిమా మొదలవబోతోంది. నువ్వు కూడా చూస్తావా?" అనడిగాడు బృహస్పతి భార్య ఇందుమతిని.

"నావల్ల కాదు. తండ్రీ కొడుకులు చూసుకోండి. నేను ఎదురింటామెతో మాట్లాడుతూ కూర్చుంటాను" అని వెళ్లిపోయింది. అతడు నవ్వి గది తలుపులు మూసి ఫ్యాను బాగా స్పీడులో వుంచి బాలనాగమ్మ సీడీని ప్లేయర్‌లో వుంచాడు. కొంచెంసేపట్లో టీవీలో బాలనాగమ్మ సినిమా మొదలయ్యింది.

"నాన్నా.... నీ కిష్టమైన సినిమా బాలనాగమ్మ మొదలయ్యింది.... చూడు" తండ్రి ఫోటోను చూస్తూ అని ఫోటో వున్న కుర్చీ పక్కనే కింద కూర్చుని "నేనూ నీతోపాటు సినిమా చూస్తాను" అన్నాడు బృహస్పతి. చిన్నతనం నుండీ తండ్రిమీద చాలా ప్రేమ వుండేది. తండ్రి పౌరోహిత్యం చేసేవాడు. సంపాదన అంతగా వుండేదికాదు. అయిన ఆయన పిల్లలకు చదువు చెప్పించి వాళ్ల భవిష్యత్తుకోసం చాలా తాపత్రయపడేవాడు. బృహస్పతికి తండ్రి తమ గురించి పడుతున్న తపన చూసి ఒక్కోసారి తండ్రిమీద జాలి కలిగేది. ఆయనకు సాయపడితే బాగుండుననిపించేది.

డిగ్రీ పూర్తయిన కొన్నాళ్లకు బృహస్పతి ఒక ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం సంపాదించాడు. తర్వాత ఇందుమతిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత హఠాత్తుగా బృహస్పతి తండ్రికి పక్షవాతం వచ్చి మంచానపడ్డాడు. కుటుంబ పోషణ భారం పెద్దవాడైన బృహస్పతి మీదపడింది.

చిన్న ఉద్యోగం కావటంతో జీతం ఎక్కువ వచ్చేది కాదు. ముగ్గురు తమ్ముళ్లు, ముగ్గురు చెల్లెళ్లు. వీళ్లందరి బాగోగులు బృహస్పతి చూసేవాడు. అంతా కలిసి అద్దె తక్కువ అని ఒక చిన్న ఇంట్లో వుండేవాళ్లు. కనీసం తండ్రికి బాగా గాలి పోవటంకోసం ఒక సీలింగ్ ఫ్యాన్ కొనటం కూడా బృహస్పతికి సాధ్యపడలేదు. అందుకు అతను బాధపడ్డాడు. ఆదాయం తక్కువ. ఖర్చు ఎక్కువ అయినా అలాగే బృహస్పతి సంసారాన్ని లాక్కువచ్చాడు.

కాలం గడిచింది. మంచంలో వుండే బృహస్పతి తండ్రి ఒకరోజు కన్ను మూశాడు. తండ్రి పోవటంతో తన వాళ్లు అంతమంది వున్నా తను ఒంటరి వాడయినట్టుగా బాధపడ్డాడు. తనకు ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా తండ్రిని ఏ విధంగానూ సుఖపెట్టలేకపోయాడని విచారపడ్డాడు. తండ్రి మంచంలో వున్నా తనకి ధైర్యంగా వుండేది. ఇప్పుడా ధైర్యం లేదు.

బృహస్పతి తమ్ముళ్లు పెద్దవాళ్లయ్యారు. అతడికి ఉద్యోగంలో పదోన్నతి లభించింది. హోదా పెరిగింది. జీతం పెరిగింది. డబ్బుకు అంతగా ఇబ్బంది లేదు. ఇంట్లో ఆధునాతన సౌకర్యాలు అన్నీ వున్నాయి. కానీ అనుభవించటానికి తండ్రి లేడు. అదే బృహస్పతి బాధ. మంచంలో వున్నా తండ్రి బతికివుంటే బావుండేది.

ఒకసారి తండ్రి చెప్పాడు. తను చిన్నతనంలో ఆయన వుంటున్న పల్లెటూరికి రెండు వూళ్ల అవతల వున్న వూళ్లో టూరింగ్ టాకీస్‌లో స్నేహితులతో కలసి వెళ్లి బాలనాగమ్మ సినిమా చూశాడుట. ఆ సినిమా తనకు బాగా నచ్చిందనీ ఆ తర్వాత మళ్లీ ఏ సినిమానూ చూడలేదనీ చెప్పాడు.

ఆ గదిలో బాలనాగమ్మ సినిమాను చూస్తున్నప్పుడు బృహస్పతికి హఠాత్తుగా ఒక దృశ్యం గుర్తుకు వచ్చింది.

వాళ్లు వుంటున్న ఇంటికి బాగా దగ్గరలో ఒక పాత సినిమా థియేటర్ వుండేది. అందులోకి ఒకసారి బాలనాగమ్మ సినిమా వచ్చింది.

బృహస్పతి మంచంలో వున్న తండ్రికి చెప్పాడు. "నాన్నా.... నీ కిష్టమయిన బాలనాగమ్మ సినిమా మన ఇంటి దగ్గర థియేటర్లోకి వచ్చింది"

"ఒకసారి మళ్లీ చూడాలిరా.... చిన్నతనంలో ఎప్పుడో చూశాను.... ఎంత బావుంటుందని?" అన్నాడు ఆశగా....

తండ్రి కళ్లలో మెరుపు చూసి బృహస్పతి ఆ సినిమా అంటే తండ్రికి ఎంత ఇష్టమో అర్థం చేసుకున్నాడు.

ఆరోజు సాయంత్రం నడవలేని తండ్రిని రెండు చేతులమీదా ఎత్తుకుని థియేటర్లోకి తీసుకువెళ్లాడు బృహస్పతి. పక్కన తమ్ముడు కూడా వచ్చాడు.

థియేటర్లో తండ్రికి చెరోపక్కనా బృహస్పతీ, అతడి తమ్ముడూ కూర్చున్నారు.

సినిమా చూస్తున్నంతసేపూ తన చిన్నతనపు విశేషాలను ఎంతో ఉత్సాహంతో చెప్పాడు తండ్రి. తండ్రికి చిన్ననాటి మధుర స్మృతులను, అనుభూతులను తిరిగి కలిగించినందుకు చాలా సంతోషమయ్యింది. బృహస్పతికి సెంటిమెంట్లు ఎక్కువ. అనుభూతులకు అతడు ఎక్కువ విలువనిస్తాడు.

తండ్రి బతికి వున్నప్పుడు తను ఇంట్లో సీలింగ్ ఫ్యాను కూడా లేదు. ఇప్పుడు ఆ గదిలో ఫ్యాను వుంది. దాన్ని ఫుల్ స్పీడులో వుంచాడు. బృహస్పతికి ఒక నమ్మకం వుంది.

తండ్రి చనిపోయినా తండ్రి ఆత్మ తమ మధ్యనే వుంటుందనీ, ఆయన తమని గమనిస్తూ వుంటాడనీ ఒక ప్రగాఢమయిన నమ్మకం వుంది. ఆ నమ్మకంతోనే తండ్రికి బాగా ఇష్టమయిన బాలనాగమ్మ సినిమా గదిలో ఏర్పాటుచేశాడు.

బృహస్పతికి గతం గుర్తుకువచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. అతను కళ్లు తుడుచుకుంటున్నప్పుడు –

ఎందురింట్లో వుండే సూర్యనారాయణ వచ్చి గేటు దగ్గర నిల్చుని ఎదురింటామెతో మాట్లాడుతున్న ఇందుమతిని బృహస్పతి గురించి అడిగాడు.

"ఉన్నారండీ.... ఆఫీసుగదిలో కూర్చుని సీడీ ప్లేయర్ పెట్టుకుని వాళ్ల నాన్నగారికి ఇష్టమయిన బాలనాగమ్మ సినిమాను మా మామగారితో కలిసి చూస్తున్నారు" అన్నది.

"మీ మామగారు పోయారుకదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును పోయారు.... ఆ కథ ఆయన్నే అడగండి" అన్నది.

తర్వాత సూర్యనారాయణ తలుపు తట్టాడు. పైకి వచ్చి బృహస్పతి తలుపు తెరిచాడు. ఎదురుగా కనపడుతున్న దృశ్యాన్ని చూసి "ఇదేమిటి? మీ నాన్నగారి ఫోటో పక్కన పెట్టుకుని బాలనాగమ్మ సినిమాను చూస్తున్నారా?" అడిగాడు సూర్యనారాయణ.

"కాదు. బాలనాగమ్మ అంటే మా నాన్నకు ఇష్టం. ఆ సినిమా మా నాన్నకు చూపిస్తున్నాను" అని చెప్పాడు బృహస్పతి.

"అదేమిటి?" అన్నాడు సూర్యనారాయణ ఆశ్చర్యంతో....

అసలు విషయం చెప్పాడు బృహస్పతి.

అప్పుడు ఆయన బృహస్పతిని కౌగలించుకొని "మీరు చాలా గొప్పవారు. ఎందుకంటే బతికివున్న తల్లిదండ్రుల గురించి పట్టించుకోని మనుషులు నాకు చాలామంది తెలుసు.

అలాంటిది మీరు చనిపోయిన తండ్రి ఫోటోకు ఆయనకు ఇష్టమయిన సినిమాను చూపిస్తున్నారంటే మీరు నా దృష్టిలో చాలా గొప్ప మనిషి" అన్నాడు సూర్యనారాయణ.

"అలా అనకండి. ఇందులో గొప్పతనం ఏమీ లేదు. నా సెంటుమెంటు నాది. నా నమ్మకం, తృప్తి నాకు ముఖ్యం. అదృశ్యంగా మా నాన్న ఈ గదిలో వుండి బాలనాగమ్మ సినిమా చూస్తున్నాడని నేను అనుకుంటున్నాను.

మా నాన్న చనిపోయినా అయనమీద నాకు వున్న ప్రేమ అలాగే వుంది. భౌతికంగా మా నాన్న చనిపోయి వుండవచ్చు.

కానీ ఈనాటికీ ఆయన నా జ్ఞాపకాలలో బతికి వున్నాడు" అన్నాడు.

బృహస్పతి కళ్లు తుడుచుకుంటూ.... జీరబోయిన గొంతుతో. ❖

*చిత్ర మాసపత్రిక, మార్చి 2009*